క్లుప్తంగా

వన్‌టైం సెటిల్‌మెంట్‌తో వడ్డీ మాఫీ

కందుకూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్నుపై వన్‌టైం సెటిల్మెంట్ స్కీమ్ ప్రవేశపెట్టిందని 2022-23 సంవత్సరం వరకు ఉన్న పాత బాకీలు, ప్రస్తుతం సంవత్సరం పన్ను మొత్తం ఈనెల 31వ లోపు కడితే.. వారందరికీ వడ్డీ మొత్తం మాఫీ అవుతుందని కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని కోరారు.

భూ సర్వే పరిశీలన



మన్నేటికోటలో భూసర్వే పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

ఉలవపాడు: మండల పరిధిలోని మన్నేటికోట గ్రామంలో అమలు అవుతున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమం కందుకూరు డీఎల్‌పీఓ కృష్ణమోహన్ పరిశీలించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన భూములు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సర్వేకు సంబంధించి పలు సూచనలు అందించారు. పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీఓ చెంచమ్మ, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్వత రెడ్డి గెలుపుపై హర్షం

ఉలవపాడు: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి విజయం పట్ల వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్రనాయకుడు కేశవరపు జాలిరెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు బాధ్యత కలిగిన వ్యక్తిని ఎన్నుకున్నారన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా నాయకులు చలమల ప్రభాకరరెడ్డి గెలుపు పట్ల తమ యూనియన్ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

గుడ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటింటా వైద్యం-ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి సాయిప్రసన్న అన్నారు. మండలంలోని స్వర్ణాజీపురంలో శుక్రవారం ఇంటింటా వైద్యం-ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సాయిప్రసన్న గ్రామంలోని 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి గృహాలకు వెళ్ళి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సకాలంలో మందులు వేసుకుంటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలతున్నందున గ్రామంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుకుమార్

వెలిగండ్ల: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టి. సుకుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలను పోత్సహించడం నేరమన్నారు. గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు చేస్తే , తల్లిదండ్రులను, వివాహం చేసిన వారు, వివాహానికి హాజరైన వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం వీస్తున్న చల్లటి గాలులకు తగు చర్యలు చేపట్టేవిధంగా ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో నీటి కొరత లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి, ఎంఈఓ దాసుప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజరు పార్వతి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పనులు పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: అకాల వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం ఆయన పలు వార్డుల్లో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థ పరిశీలించారు. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షాలకు మురికినీరు రోడ్లపై నిలిచినట్లు 15వ వార్డు ప్రజలు విన్నమించడంతో ఆయా ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు చేయించారు. అకాల వర్షాలతో ఎక్కడైన కాలువల సమస్యలు, నీటి సమస్యలు ఎర్పడితే వెంటనే ఆ ప్రాంత ప్రజలు మున్సిపాలిటీకి సమాచారం ఇవ్వాలని చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. వైస్ చైర్మన్ మాణిక్యరావు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తోన్న రాగి



విరగ పండిన రాగి పంట

హనుమంతునిపాడు: రాగి పంట సిరులు కురిపిస్తోంది. మండలంలోని బోరు బావుల కింద వరిపంట సాగు చేసిన మాగాణి భూముల్లో ప్రస్తుతం రాగి పంట సాగు చేశారు. రాగులకు మంచి గిరాకీ ఉంది. గతంలో బావుల కింద ప్రతి గ్రామంలో రాగి, సజ్జ, కొర్రలను పండించేవారు. వర్షాధారంగా ఆరికలు, సామలు, వరిగలు సాగు చేసేవారు. అనంతరం చెరువులు, వ్యవసాయ బావులో నీరు తగ్గడంతో ఈ పంట క్రమేణే తగ్గుతూ వచ్చింది. గతంలో గ్రామాల్లో ప్రతి ఒక్కరూ రాగి సంగటి, ఆరిక, కొర్ర, వరిగ, సజ్జ, జొన్న అన్నం ఎక్కువగా తినేవారు. అనంతరం వాటిని తినటం తగ్గుతూ వచ్చింది. వరి పంటను సాగు చేయటం మొదలు పెట్టిన తరువాత చిరు ధాన్య పంటలు సాగు తగ్గింది. ప్రస్తుతం మళ్లీ చిరుధాన్యాలకు మంచి రోజులు వచ్చాయి. గ్రామాల్లో మధ్యాహ్నం పూట రాగి సంగటి వాడుతున్నారు. షుగర్ వ్యాధి గ్రమస్తులు ఇష్టంగా తింటున్నారు. పట్టణాలల్లో కూడా సంగటి హోటళ్ల వెలశాయి. దీంతో రాగి ధాన్యానికి మంచి గిరాకీ వచ్చింది. గ్రామాల్లో చెరువుల, కింద, బోరు బావులు కింద వరి మాగాణి భూములో వరి కోత కోసిన తరువాత రాగి పంటను సాగు చేసి పండిస్తున్నారు. రైతు వద్దనే కిలో రాగులు రూ. 40 పెట్టి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో రాగి పంట సాగుతో మంచి లాభాలు రాబట్టుతున్నారు. హాజీపురం, దొడ్డిచింతల, కొత్త సీతారాంపురం గ్రామాల్లో చెవరు కింద, బోరు బావుల కింద సాగు చేసిన రాగి పంట సిరులు కురిపిస్తోంది. రాగి గడ్డి పశువులకు బలమైన మేత కావడంతో దానికి కూడా గిరాకీ పెరిగింది.

శనగలను కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోండి



అంకేపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుదీప



కొండపిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాము

కొండపి: శనగలను కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని రైతులకు ఏఓ వి.రాము సూచించారు. కొండపి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శనగల కొనుగోలు కేంద్రాన్ని సభ్యులతో కలిసి ఏఓ ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటా ఎర్ర శనగలకు రూ.5,530 మద్దతు ధర ఇస్తోందని పేర్కొన్నారు. నాబార్డు డీడీఎం వెంకటరమణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను, నాబార్డు నిధులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆర్.కోటరాజు, బొక్కిసం సుబ్బారావు, పీడీసీసీ బ్యాంకు మేనేజర్ మధుసూదన రావు, సీఈఓ ఎస్.పవన్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకట నారాయణ, సొసైటీ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిపూడి: ఈ క్రాప్‌లో నమోదు చేయించుకున్న శనగ రైతులు ఆర్బీకేలో ధాన్యాన్ని అమ్ముకోవాలని ఎంపీడీఓ ఎస్.సుదీప సూచించారు. మండలంలోని అంకేపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ.. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రబీ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రాలు రైతన్నలకు వరం



శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సుబ్బయ్య, హుసేన్‌రెడ్డి

● ఆర్బీకేలతో దళారీ వ్యవస్థకు చెక్

పామూరు: శనగల కొనుగోలు కేంద్రాలు రైతన్నలకు వరంలాంటివని, రైతు భరోసా కేంద్రాల్లో ఏపీ మార్క్‌ఫెడ్, మాఫెడ్ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని డి.వి.పల్లె రైతు భరోసా కేంద్రంలో పామూరు పీఏసీఎస్ సిబ్బంది నేతృత్వంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆర్బీకేల్లో రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలతో పాటు రైతులకు సలహాలు ఇచ్చి వ్యసాయానికి ప్రోత్సాహకంగా నిలుస్తోందన్నారు. ఇ- క్రాప్ చేయడం ద్వారా పంట నష్టపోయిన రైతులకు పరిహారం కూడా అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు. జిల్లా కార్యకర్త సభ్యులు కల్లూరి రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కోఆప్షన్ సభ్యుడు నాయబ్‌రసూల్, పీఏసీఎస్ ఏవో యస్.శేషిరెడ్డి, సచివాలయ కన్వీనర్ ఖాదర్‌బాషా, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, చల్లా శివయ్య, జె.గోవిందయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ సలీం, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



పైడిపాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి గ్రంథి మాధవి

జరుగుమల్లి(సింగరాయకొండ): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని మండల ప్రత్యేకాధికారి గ్రంథి మాధవి సూచించారు. జరుగుమల్లి మండలంలోని పైడిపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుధ్య కార్మికులతో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఉగాది పర్వదినానికి లక్ష్యంగా నిర్దేశించిన 9 గృహాల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ప్రస్తుతం 6 గృహాల నిర్మాణం పూర్తయిందని, మరో 3 ఉగాది నాటికి పూర్తవుతాయని సచివాలయ సిబ్బంది వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవి, మండల స్థాయి అధికారులు ఉన్నారు.

ఏపీఎం తీరుపై వీఓఏల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

మర్రిపూడి: స్థానిక ఏపీఎం బాబురావు వ్యవహరిస్తున్న తీరుపై వైఎస్సార్ కేపీ కార్యాలయం వద్ద మండలంలోని వీఓఏలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. సమీక్ష సమయంలో మహిళలు అని కూడా చూడకుండా ఏపీఎం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి గౌరవ వేతనం తీసుకోకుండా బ్యాంక్ పనులు సైతం చేస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ పరంగా సభ్యులకు ఏ పని జరగాలన్నా సీసీ నగదు డిమాండ్ చేస్తున్నారన్నారని ఆరోపించారు. ఏపీఎం తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.సుదీపకు వినతి పత్రం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్, జేసీబీ పట్టివేత

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి సమీపంలో శుక్రవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, జేసీబీని ఎస్ఈబీ ఎస్సై నగేష్ పట్టుకుని సీజ్ చేశారు. వాటిని మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం



కమిషనర్ డీవీఎస్ నారాయణరావు

కనిగిరి రూరల్: స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఘన, వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళల నుంచి ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు ఎంపికకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు శుక్రవారం తెలిపారు. వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ తడి, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరవుల తయారీ విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు ఈ అవార్డులకు అర్హులని కమిషనర్ వివరించారు. ఈనెల 23 లోగా తమ దరఖాస్తులను మున్సిపల్ ఆఫీసుకు అందించాలన్నారు. ఎంపికైన వారికి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. పూర్తి వివరాల కోసం ఇన్‌చార్జి శానటరీ ఇన్‌స్పెక్టర్ చెన్న కేశవులు ఫోన్ నెం 7893114370కు సంప్రదించాలన్నారు.

ప్రతి ఒక్కరూ నోటి శుభ్రత పాటించాలి



విద్యార్థులకు టూత్ బ్రష్‌లు అందిస్తున్న డాక్టర్ స్రవంతి

కనిగిరి రూరల్: ప్రతి ఒక్కరూ నోటి పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సయ్యద్ అబ్దుల్ కలాం అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వైద్యశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కలాం మాట్లాడుతూ నోటి ఆరోగ్యం కోసం రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని తెలిపారు. శీతల పానీయాలు తగ్గించాలని, ఏదైనా ఆహారం తిన్న వెంటనే నోరు పుక్కిలించుకోని శుభ్రం చేసుకోవాలన్నారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. డాక్టర్ కె. స్రవంతి మాట్లాడుతూ నోటి కాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పొగాకు, మద్యపానం వల్ల కలిగే నష్టాలను గూర్చి వివరించారు. ప్రభుత్వ వైద్యశాలలో ఆటో డ్రైవర్లకు దంతపరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించారు. టూత్ బ్రష్‌లు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రమేష్, నవకుమార్ పాల్గొన్నారు.

నేడు శ్రీయోగానంద స్వామి ఆలయ మెట్ల నిర్మాణానికి శంకుస్థాపన

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఉపాలయానికి తూర్పు వైపున మెట్ల నిర్మాణానికి శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు నిర్వహించనున్నట్లు ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ సోదరుని కుమారుడు, వ్యాపారవేత్త ఆమంచి రాజేంద్ర మెట్ల నిర్మాణానికి ముందుకొచ్చారని, ఆయన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు

కనిగిరి రూరల్: రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు విజయఢంకా మోగించడంతో కనిగిరిలో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేశారు. పట్టణ ప్రధాన సెంటర్లలో బాణసంచా, టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం ధాటికి టీడీపీ నేతలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగుతోందన్నారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ వాస్తవాన్ని వక్రీకరించి టీడీపీ, ఎల్లో మీడియా విస్తృత ప్రచారం చేస్తోందని విమర్శించారు. 12 స్థానాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలుపొందారని వివరించారు.

పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కనిగిరిలో బుర్రా మధుసూదన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని, మరలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నే ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, టౌన్ జేసీఎస్ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాణిక్యరావు, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, కౌన్సిలర్లు దేవరాజ్, దాసరి మురళి, నక్కా రామకృష్ణా, ఖాజా మోహిద్దీన్, గూడూరి అబ్రహం లింకన్, పెన్నా ఏడుకొండలు, రామనబోయిన శ్రీను, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాసుల గురవయ్య, మాజీ ఎంపీటీసీ జిలానీ, టెలికాం అడ్వయిజరీ కమిటీ మెంబర్ జానీ, డాక్టర్ రసూల్, నాగూర్‌బీ, భారతీ తొగురు పిచ్చయ్య, కంటు గురవయ్య, చిన్నిగారి కొండలు, బాలకృష్ణారెడ్డి, యోగిరెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు విస్మరిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

సీఎస్‌పురం: సచివాలయ సిబ్బంది బాధ్యతలను విస్మరించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎంపీడీఓ డి. ఈశ్వరమ్మ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బయోమెట్రిక్ విధానం ప్రవేశ పెట్టినా కూడా సకాలంలో విధులకు హాజరు కాక పోవడం బాధ్యతా రాహిత్యాన్ని తెలియజేస్తోందన్నారు. పాఠశాలలను తనిఖీ చేయక పోవడం, మహిళా పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం జేశారు. ఆయుష్మాన్ భారత్ నూరు శాతం నమోదు చేయడంలో వెనుకబడి ఉన్నామని, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఉన్నతాధికారుల నుంచి తాను మాట పడవలసి వస్తోందన్నారు. ఏపీ సేవా సర్వీసులను సకాలంలో ప్రజలకు అందించాలని, వచ్చిన నగదును సకాలంలో ప్రభుత్వ అకౌంట్‌కు జమ చేయాలని చెప్పారు. ఈఓపీఆర్డీ సుందరరామయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో తీవ్ర నష్టం



గోపాలపురంవద్ద ఇటుకల కిందకు చేరిన నీరు

పామూరు: మండలంలో రెండు రోజుల్లో కురిసిన వర్షం గోపాలపురం, మోట్రావులపాడు, ఇనిమెర్ల గ్రామాల్లో ఇటుబట్టీ నిర్వాహకులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వర్షం అకస్మాత్తుగా గురువారం రాత్రి, శుక్రవారం సాయంత్రం కురవడంతో బట్టీల వద్ద తయారీలో ఉన్న పచ్చి ఇటుకల కిందకు నీరుచేరి పెద్ద సంఖ్యలో కరిగిపోయి బట్టీ నిర్వాహకులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వాతావరణశాఖ హెచ్చరికలతో ఇటుకలకు పైన కవర్లను కప్పినా నీరు కిందివైపున పచ్చి ఇటుకల కిందకుపోవడంతో నష్టం వాటిల్లినట్లు బట్టీల యజమానులు సత్యం రెడ్డి, బాస్కర్ పలువురు తెలిపారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలి



కారుమంచిలో శనగ పంటను పరశీలిస్తున్న ఏఓ స్వర్ణలత

టంగుటూరు: అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఓ స్వర్ణలత సూచించారు. మండలంలోని సూరారెడ్డిపాలెం, కారుమంచి రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితిని గమనించి రెండు లేదా మూడు రోజుల తర్వాత వరి కోత కోయాలని రైతులకు సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిస్తే పక్వానికి వచ్చిన శనగలో గింజలు రంగు మారి ముదురు కాయలు మొలక వచ్చే ప్రమాదం ఉందని, ప్రస్తుతానికై తే ఇబ్బంది లేదన్నారు. మండలంలో 28.4 మి.మీ వర్షపాతం నమోదైందని ఏఓ తెలిపారు.

నిర్మాణ పనులు పూర్తి చేయాలి



చిలకపాడువద్ద కాలనీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ

పామూరు: మండలంలోని జగనన్న కాలనీల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని చిలకపాడు లేఅవుట్‌లోని కాలనీల నిర్మాణాలను శుక్రవారం హౌసింగ్ ఏఈ ఎల్లంరాజుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీల్లో స్థలాలు మంజూరైన లబ్ధిదారులందరూ యుద్ధ ప్రాతిపదికన కాలనీల నిర్మాణాలు చేపట్టాలన్నారు. కాలనీలు కట్టుకున్న లబ్ధిదారులకు వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. అదేవిధంగా కాలనీల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పననుకూడా త్వరితగతిన పూర్తి చేయించాలని హౌసింగ్ ఏఈని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్నారు. కాలనీల నిర్మాణ పనులను తరచూ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ పనులు వేగవంతం చేయించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఈవోపీఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు వెంకటరత్నం, మౌనిక, నాగరాజు, అమీర్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరూర్ వైశ్యా బ్యాంక్ ప్రారంభం



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న కమిషనర్

కనిగిరి రూరల్: పట్టణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన కరూర్ బ్యాంక్ శాఖ కార్యాలయాన్ని, ఏటీఏంను శుక్రవారం కమిషనర్ డీవీఎస్ నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ కేవీ ప్రసాద్‌మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 51 శాఖలు ఉన్నట్లు వెల్లడించారు. కనిగిరిలో కొత్తగా 52వ శాఖను ఏర్పాటు చేశామని తెలిపారు. గత ఏడాది చివరి నాటికి విజయవాడ డివిజన్ పరిధిలో రూ. 7,292 కోట్ల వ్యాపారాన్ని చేసినట్లు తెలిపారు. 1916లో రూ. 1 లక్ష మూలధనంతో బ్యాంక్‌ను స్థాపించినట్లు వివరించారు. డివిజనల్ ఆపరేషన్ అధికారి ఐవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డివిజనల్ బ్యాంకింగ్ సేవలను కనిగిరి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత డాక్టర్ బి. నాగసత్యావతి జ్యోతి ప్రజ్వలన చేశారు.

పూర్వ విద్యార్థుల తోడ్పాటుతో పాఠశాల అభివృద్ధి



మాట్లాడుతున్న విశ్రాంత హెచ్‌ఎం బీఎల్ఎన్ శాస్త్రి

మర్రిపూడి: గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల తోడ్పాటుతో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసుకుందామని విశాంత్ర ప్రధానోపాధ్యాయుడు బీఎల్ఎన్ శాస్త్రి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(జనరల్) స్థాపించి శుక్రవారంతో నూరు వసంతాలు పూర్తయిన్న సందర్భంగా గ్రామ పెద్దలు సమావేశం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం లీలావతి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో బీఎల్ఎన్ శాస్త్రి మాట్లాడుతూ.. పాఠశాలకు పూర్వ విద్యార్థులు, గ్రామస్తుల సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్బారావు, తాతా రమణయ్య, మేడా నరసింహారావు పాల్గొన్నారు.